
మీర్‌పేట్ మున్సిపల్ భవనం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


శ్రీరాముడి శోభయాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి


పాదయాత్రలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


కల్యాణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న లతామా ఫౌండేషన్ చైర్మన్ మాదవిలత

పాలనా సౌలభ్యం కోసమే నూతన భవనం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని ప్రజలందరికీ అనువుగా ఉండాలనే ఉద్దేశంతో, పాలనా సౌలభ్యం కోసం మీర్‌పేట్‌లో దాదాపు రూ.2కోట్ల అంచనా వ్యయంతో నూతన భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లోని దీన్‌దయాల్‌నగర్ సమీపంలో ఆర్‌సీఐ రోడ్డు పక్కన జరుగుతున్న భవనం నిర్మాణం పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల చెంతకు పాలన తీసుకువచ్చి, అన్ని వర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని అన్నారు. మీర్‌పేట్‌లో గ్రామ పంచాయతీల నాటి పాత భవనం ఉన్నందున దాని స్థానంలో ఈ నూతన భవనం నిర్మింపజేస్తున్నామని పేర్కొన్నారు. పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్, కౌన్సిల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్ సిద్దాల లావణ్యబీరప్ప, నాయకులు లక్ష్మణ్‌ముదిరాజ్, గోపీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సగర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లెలగూడ 16వ డివిజన్‌కు చెందిన సగర సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం కార్పొరేటర్ అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలిసి సబితారెడ్డి ఆవిష్కరించారు. మేకల యాదగిరి, చల్లా సురేందర్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ వీరస్వామిగౌడ్ తదితరులు

బలిజగూడ సర్వే నంబర్ 55, 56

రైతులకు న్యాయం చేయండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరిన సర్పంచ్

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): బలిజగూడ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని గ్రామ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్ ఆదివారం గ్రామస్తులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా గ్రామ సర్వే నంబర్ 55, 56లోని రైతులను న్యాయం చేయాలని కోరారు. సదరు సర్వే నంబర్‌లోని సుమారు 65 మంది రైతుల పేర్లను పహాణీ రికార్డులో చేర్పించి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరారు. అదే విధంగా రోడ్డు విస్తరణలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు చేయించేలా అధికారులను ఆదేశించాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళ్లలో గ్రామానికి ఆర్టీసీ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, ఐలయ్య, బల్లెపు సతీష్ కుమార్, రాజేష్, పవన్, రమేష్, ముత్యాలు రాము, రైతులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మాజీ సీఏపీఎఫ్ ఉద్యోగులు

మాజీ సీఏపీఎఫ్ ఉద్యోగులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

సరూర్‌నగర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్)లో పనిచేసిన మాజీ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఏపీఎఫ్ మాజీ ఉద్యోగుల సంఘం బడంగ్‌పేట్ డివిజన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. సంఘం సమావేశం ఆదివారం బడంగ్‌పేట్‌లోని పీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కె.శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన సబితారెడ్డి తమ సంఘం భవనం కోసం స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు తగిన స్థలం కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వినతిని పరిగణనలోకి తీసుకుని మాజీ సీఏపీఎఫ్ ఉద్యోగుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ నిధిని సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. ఆయా అంశాలపై త్వరలోనే సంబంధిత ప్రభుత్వ పెద్దలను కలిసి వినతి పత్రం అందజేయనున్నట్టు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన సలహాదారుడు ఎస్.ఎన్.రెడ్డి, ప్రతినిధులు రాజారత్నం, పి.యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

మల్టీపుల్ స్ల్కెరోసిస్‌కు నిమ్స్‌లో చికిత్స

సనత్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మల్టీపుల్ స్ల్కెరోసిస్‌తో బాధపడుతున్న వారికి నిమ్స్‌లో ప్రత్యే వైద్య సేవలు అందిస్తున్నట్లు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. ఆదివారం ఆస్పత్రి ఆడిటోరియంలో న్యూరాలజీ విభాగంలో మల్టీపుల్ స్ల్కెరోసిస్ అప్‌డేట్ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మధుమేహంలకు కాళ్లు, చేతులు తిమ్మిరిగా ఉండటం సహజమని, మధుమేహం లేకున్నా తిమ్మిర్లు, నీరసం, నిస్సత్తువ ఉంటే మల్టీపుల్ స్ల్కెరోసిస్‌కు సంకేతమని, నరాలపై మైలిన్ పొర దెబ్బతినడంతో సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. రోగులకు వ్యాధి నయం చేసేందుకు న్యూరాలజీ విభాగం వైద్యులు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి అప్సన్ జబీన్, ప్రొఫెసర్ సూర్యప్రభ, అసోసియేట్ ప్రొఫెసర్ శిరీష, వైద్యులు సుల్తానా షేక్, మహేష్, కిమ్స్ ఆస్పత్రి వైద్యులు మోహన్, సీతాలక్ష్మి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ప్రజయ్ నివాస్ -2 లో ఆదివారం వృద్ధులకు రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ శాఖ సంచార వైద్య వాహన ప్రాజెక్టు వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షల అనంతరం వృద్ధులకు ఉచితంగా అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కార్తీక్ వృద్ధులకు తగిన సూచనలు చేశారు.

శ్రీరాముడి శోభాయాత్ర


శివగంగ తదితర కాలనీల్లో ఆదివారం బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ

మన్సూరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠతో వాడవాడలా రామనామ స్మరణలతో పండుగ వాతావరణం నెలకొందని జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పుస్కరించుకొని మన్సూరాబాద్ విజయశ్రీకాలనీలోని శ్రీపద్మావతీ వెంకటేశ్వర దేవాలయం నుంచి ప్రారంభమైన శ్రీరాముడి శోభాయాత్రను నర్సింహారెడ్డి ఆదివారం ప్రారంభించారు. సుమారు 40 కాలనీల మీదుగా శోభాయాత్ర చేసి సరస్వతీనగర్‌లోని హనుమాన్ దేవాలయం వద్ద ముగించారు. ప్రతిఇంటిపై కాషాయపు జెండాను ఎగువేయాలని ఆయన సూచించారు.

నేడు సాయిసంస్థాన్‌లో ప్రత్యేక పూజలు


గుండా మల్లయ్య, చైర్మన్

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో సోమవారం శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షర్డిసాయి సంస్థాన్‌లో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దిల్‌సుఖ్‌నగర్ శ్రీ షర్డిసాయి సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ గుండా మల్లయ్య వెల్లడించారు. సోమవారం ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 8 గంటలకు శ్రీ సీతారామ చంద్ర స్వామి వార్లకు ఆవుపాలతో అభిషేకం, నవ కలశారాధన, పంచామృతాభిషేకం, షోడశోపచార పూజ, నైవేద్యము, పంచ హారతి, వేదాశీర్వచనము, 9గంటల నుంచి 11 గంటల వరకు హనుమాన్ ఛాలీసా, ప్రత్యేక భజన కార్యక్రమం, 11 గంటలకు సంస్థాన్ వద్ద జెండా ఆవిష్కరణ, 11.30 గంటలకు శ్రీ సీతారామ చంద్ర స్వామి వార్ల శోభాయాత్ర, మధ్యాహ్నం 12.30 గంటలకు మహాఅన్నదానం, సాయంత్రం 5 గంటలకు భక్తులచే ప్రత్యేక దీపాలంకరణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పాదయాత్రను ప్రారంభించిన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా..

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని జైపురి కాలనీ హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో జైపురి కాలనీ సాయిబాబా దేవాలయం నుంచి కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం వరకు భక్తులు చేపట్టిన పాదయాత్రను తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ జి.లక్ష్మణ్, గిరియాదవ్, గోపి, మాధవశర్మ పాల్గొన్నారు.

స్నేహపురి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

కొత్తపేట : అయోధ్య రామయ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష వీక్షణకు స్నేహపురి శ్రీ పద్మావతీ గోదా సమేత వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారని చైర్మన్ వారణాశి వంశీ తెలిపారు. ఆలయంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి అయోధ్య రామాలయంలో నిర్వహించే విశేష పూజల ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. కమిటీ కార్యదర్శి ప్రసన్నకుమార్, కోశాధికారి హేసుందర్‌రావు, ట్రస్టీ అనంతుల సురేందర్‌రెడ్డి, మేనేజర్ రవి భక్తులకు

సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): న్యూ మారుతీనగర్ తూర్పు కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. ఆదివారం కాలనీ రోడ్ నెం.1లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్ నెం.5లో కొందరు దారిపక్క స్థలాన్ని ఆక్రమించి పూల మొక్కలు పెంచుతున్నారు. డ్రైనేజీ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా పూల మొక్కలున్న ప్రాంతాన్ని తవ్వేస్తున్నారని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. రోడ్డు ఆక్రమించడం తగదని కాలనీ ప్రతినిధులు పేర్కొన్నారు. కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని పవన్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో కాలనీ కార్యదర్శి దుడ్డు సుబ్రమణ్యం, కాలనీ వాసులు పాల్గొన్నారు.


కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

ఆమని, రోజా రమణికి శోభన్‌బాబు సిల్వర్‌క్రౌన్ పురస్కారం

రవీంద్రభారతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు శోభన్‌బాబు అని వక్తలు అభివర్ణించారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ శోభన్‌బాబు సేవా సమితి, సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శోభన్‌బాబు 88వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలనాటి నటీమణులు రోజా రమణి, ఆమనికి శోభన్‌బాబు సిల్వర్ క్రౌన్ పురస్కారాలు ప్రదానం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ బోర్డ్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త, సీల్‌వెల్ కార్పొరేషన్ సంస్థ సీఎండీ బండారు సుబ్బారావు, సీనియర్ పాత్రికేయులు మహ్మద్ రఫీ, దైవజ్ఞ శర్మ హాజరై పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శోభన్‌బాబు నట, నిజ జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో శోభన్‌బాబు గీతాలాపన చేశారు. రాజువయ్యా మహరాజువయ్యా పేరిట సంగీత విభావరి నిర్వహించారు.

ఆళ్వార్ల మార్గం భక్తులకు ఆదర్శప్రాయం

● డాక్టర్ శింగరాచార్య స్వామి

అల్వాల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆళ్వార్ల ప్రపత్తి మార్గం భక్తులకు ఆదర్శప్రాయం...అనుసరణీయమని, శ్రీమహావిష్ణువు భక్తగ్రేసురులైన ఆళ్వార్లు చూపిన మార్గంలో భక్తులు పయనించాలని సుప్రసిద్ధ సంప్రదాయ పండితులు డాక్టర్ ఈఏ.శింగరాచార్య స్వామి పేర్కొన్నారు. ఓల్డ్ అల్వాల్‌లో శ్రీవైష్ణవ సంప్రదాయ పరిరక్షణకు, ప్రచారానికి జీవిత కాలం కృషి చేసిన స్వామినాథ దేశిక, శ్రీరంగ శఠకోప దేశిక, వెంకట నరసింహ దేశికుల జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న విశిష్ట ఉపన్యాస కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆళ్వార్లలో ముఖ్యులైన నమ్మాళ్వార్ల సామవేదసారంగా తిరువాయ్‌మొళికి వ్యాఖ్యా న రూపంగా నంబిళ్లై ఆచార్యులు రచించిన "భగవద్ విషయం" గ్రంథంలోని విశేషాలతో కూడిన గ్రంథాన్ని తెలుగులో శింగరాచార్యులు అనువదించారు. ఈ గ్రంథాన్ని సుప్రసిద్ధ పాంచరాత్రగమ విద్వాంసులు సముద్రాల రమాకాంతాచార్య స్వామి ఆవిష్కరించారు. అనంతరం శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రాశస్త్యాన్ని వివరించి భక్తులకు ఆశీస్సులు అందించారు. గ్రంథావిష్కరణ సభలో నిర్వాహకులు సముద్రాల శఠకోపాచార్య, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ చెన్నమనేని హనుమంతరావు, భూ విజన్ పక్ష పత్రిక వ్యవస్థాపకులు దేవులపల్లి వరప్రసాదరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆచార్య త్రయంలో మూడో వారైన సముద్రాల వెంకటనరసింహ దేశికుల జయంతిని పురస్కరించుకుని సముద్రాల రమాకాంతాచార్య స్వామికి చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక పురస్కారాన్ని చెన్నమనేని హనుమంతరావు, సముద్రాల శఠకోపాచార్యులు అందించారు. కార్యక్రమంలో ఆహార్ రెస్టారెంట్ నిర్వాహకులు సరిదెన రాహుల్, రాకేష్, పాండురంగాచార్య, లక్ష్మణ్ స్వామి, గోపాలకృష్ణ లక్ష్మణాచార్య పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమాకాంతాచార్య స్వామి



టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో అర్జున అవార్డు గ్రహీతలు చేతన్ ఆనంద్, సిక్కిరెడ్డి, కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి, అసోసియేషన్ చైర్మన్ సామ ప్రభాకర్‌రెడ్డి

క్రీడలతో గుర్తింపు తేవాలి

అర్జున అవార్డు గ్రహీతలు చేతన్ ఆనంద్, సిక్కిరెడ్డి

చాదర్‌ఘాట్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్ డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 పోటీలను అర్జున్ అవార్డు గ్రహీతలు చేతన్ ఆనంద్, ఎన్.సిక్కిరెడ్డి, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ఉపాధ్యక్షురాలు గోవర్ధని, ఒలింపిక్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సుమిత్‌రెడ్డి, ముసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా చేతన్ ఆనంద్, సిక్కిరెడ్డిలు మాట్లాడుతూ క్రీడలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి రాష్ట్రానికి, దేశానికి గుర్తింపు తేవాలని సూచించారు. ఐదు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌లో 104 జట్లు పోటీ పడుతున్నాయని, ఆదివారం 20కి పైగా జట్లు పోటీపడ్డాయని అసోసియేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ జాదవ్, ఉపాధ్యక్షులు గంగుల వెంకటేశ్వర్‌రెడ్డి, డి.వెంకటేశం కార్యదర్శి సింగిరెడ్డి శ్రీదర్‌రెడ్డి, కోశాధికారి స్వామిగౌడ్ ప్రకటించారు.

'లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగుదాం'

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ లెనిన్ విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగుదామని సీపీఐ మేడ్చల్ జిల్లా సమితి సభ్యులు బొడ్డు కృష్ణ, ఉప్పల్ మండల కార్యదర్శి పీ.రామనారాయణ అన్నారు. ఆదివారం కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా న్యూ నాగోల్‌లోని ఎస్‌కే డాంగే భవన్‌లో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు భూపతి సురేష్, ఎండీ.బషీర్, ఉడుతల మల్లేశం, పీ.మధు, ఎస్.రాములు, పీ.శివ, జీ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, జనవరి 21(ఆంధ్రజ్యోతి): వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ప్రజయ్ నివాస్-2లో ఆదివారం వృద్ధులకు రంగారెడ్డి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ శాఖ సంచార వైద్య వాహన ప్రాజెక్టు వైద్యసిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షల అనంతరం వృద్ధులకు ఉచితంగా అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కార్తీక్ వృద్ధులకు తగిన సూచనలు చేశారు.

'బఫర్'పై గందరగోళం

- ఎఫ్‌టీఎల్ నుంచి 9మీటర్ల వరకు బఫర్‌జోన్
- ప్రస్తుతం 60 ఫీట్లకు పెంచుతూ మార్కింగ్
- హయత్‌నగర్ కుమ్మరికుంట పరిధి వాసుల ఆందోళన
- జీహెచ్ఎంసీ అనుమతులతో పదేళ్ల క్రితమే ఇళ్ల నిర్మాణం
- కూల్చివేస్తారేమోనని భయభ్రాంతులు


హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువుకు అధికారులు ఏర్పాటు చేసిన ఎఫ్‌టీఎల్ హద్దు దిమ్మె



ఎఫ్‌టీఎల్‌కు దూరంగా ఉన్న ఇల్లుకు బఫర్ జోన్ అని రాసి పెట్టిన అధికారులు

హయత్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అధికారులు వ్యవహరిస్తున్న తీరు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోతోంది. ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్)ను నిర్ధారించి బఫర్ జోన్‌ను సూచించిన కొన్నేళ్ల తర్వాత ప్రస్తుతం బఫర్‌జోన్ పరిధిని పెంచడంపై గందరగోళం నెలకొంది. పదేళ్ల క్రితమే ఏర్పాటు చేసుకున్న నివాసాలను కూల్చివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయేమోనని హయత్‌నగర్ కుమ్మరికుంట శివారు ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

హయత్‌నగర్ కుమ్మరికుంట చెరువుకు గతంలోనే ఇరిగేషన్, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దులు ఏర్పాటు చేశారు. హయత్‌నగర్ బస్సు డిపో ప్రహరీ నుంచి కుమ్మరికుంట చెరువు అలుగు వరకు పద్మావతి, తెలంగాణ పద్మావతి కాలనీలు వెలిశాయి. తెలంగాణ పద్మావతి కాలనీ ఫేజ్-2 రోడ్డు నెం.1 చివరన ఎఫ్‌టీఎల్ హద్దును ఏర్పాటు చేశారు. అందుకనుగుణంగా బఫర్ జోన్ పరిధిని సూచించారు. వాస్తవంగా చిన్నచెరువు, లేదా కుంటకు ఎఫ్‌టీఎల్ హద్దు నుంచి సుమారు 9 మీటర్లు అంటే 30 ఫీట్ల వరకు ఉన్న ప్రాంతాన్ని బఫర్‌జోన్‌గా పరిగణిస్తారు. ఆ తర్వాత ప్రాంతాన్ని అధికారుల అనుమతులతో ఇతర అవసరాలకు వినియోగిస్తారు. పదేళ్ల క్రితం కొందరు జీహెచ్ఎంసీ అనుమతులతో ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్నారు. వారి అవసరాలను తీర్చేలా అక్కడి అధికారులు డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్లు కూడా ఏర్పాటు చేశారు.

బఫర్‌జోన్ పెంచుతూ మార్కింగ్..

రెండు రోజుల క్రితం జీహెచ్ఎంసీ లేక్, హయత్‌నగర్ మండల రెవెన్యూ అధికారులు చెరువు బఫర్ జోన్‌ను పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ నుంచి బఫర్‌జోన్ పరిధిని 30 ఫీట్లు కాకుండా 50 నుంచి 60 ఫీట్లకు పెంచుతూ మార్కింగ్ చేశారు. దీంతో పెంచిన పరిధిలోకి వచ్చిన పది ఇళ్లు, రెండు షెడ్ల వద్దకు వెళ్లి ఇవి బఫర్‌జోన్ పరిధిలోని వస్తున్నాయని గోడలకు మార్కింగ్ చేశారు. దీంతో గృహ యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల క్రితమే జీహెచ్ఎంసీ అధికారులు అనుమతుల ద్వారానే ఇళ్లను నిర్మించుకున్నామని, ఇప్పుడు లేక్ అధికారులు, రెవెన్యూ అధికారులు వచ్చి ఇది బఫర్‌జోన్ పరిధిలోనికి వస్తుందని హెచ్చరించి వెళ్లడం ఏమిటని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇళ్లు నిర్మించుకున్న పదేళ్ల తర్వాత వచ్చి అధికారులు బఫర్ జోన్ హద్దులు ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు వాస్తవాలు తెలుసుకుని న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని తాము ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని పలువురు తెలిపారు.

వివరాలను టౌన్ ప్లానింగ్‌కు పంపిస్తాం

కుమ్మరికుంట చెరువు ఎఫ్‌టీఎల్ దాటి బఫర్‌జోన్‌లో నిర్మించిన ఇళ్ల గురించి లేక్, రెవెన్యూ, సర్వే అధికారులంతా కలిసి సంయుక్త పర్యవేక్షణ చేశాం. కోర్టులో కేసు ఉండడంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఇళ్లు ఉన్నాయా అని కలెక్టర్ అడిగారు. అందులో భాగంగా బుధవారం జాయింట్ పరిశీలన చేశాం. ఎక్కడి వరకు బఫర్ వస్తుందో మార్క్ చేశాం. ఎక్కడెక్కడ నిర్మాణాలు ఉన్నాయో పరిశీలించాం. స్టేట్‌మెంట్ సిద్ధం చేసి జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్‌కు పంపిస్తాం

- నాగరాజు, ఏఈ లేక్, హయత్‌నగర్ డివిజన్